పోస్టర్ ఆవిష్కరిస్తున్న సుందర్‌రాజ్ యాదవ్ తదితరులు

రానున్నది బీసీల రాజ్యాధికారమే

కూడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్

హనుమకొండ, జనవరి 26 : రాబోయేది బీసీల రాజ్యాధికారమేనని కుడా మాజీ చైర్మన్, బీసీ సంఘం నాయకుడు సంగంరెడ్డి సుందర్‌రాజు యాదవ్ అన్నారు. హనుమకొండ టీచర్స్‌కాలనీలో ఆదివారం నిర్వహించిన బీసీ సంక్షేమ పరపతి సంఘం 8వ వార్షికోత్సవంలో సుందర్‌రాజు యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హలో బీసీ చలో వరంగల్ నినాదంతో ఫిబ్రవరి 2న హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వేదికగా నిర్వహించనున్న బీసీ రాజకీయ యుద్ధభేరి సభను విజయవంతం చేయాలని కోరారు. సభకు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ హాజరుకానున్నట్లు తెలిపారు. 30 ఏళ్ల నుంచి బీసీలకు అన్యాయం జరుగుతున్నదన్నారు. 2028లో బీసీ రాజ్యం రాబోతుందన్నారు. అనంతరం బీసీ పరపతి సంఘం సభ్యుల ఆధ్వర్యంలో బీసీ రాజకీయ యుద్ధభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు విశ్వనాథం, కార్యదర్శి కుమారస్వామి, అడ్వైజర్ నరహరి, రాజమౌళి పాల్గొన్నారు.

కేశవరావు మెమోరియల్ భవనం స్వాతంత్ర్య సమరయోధులకు కేటాయింపు

హనుమకొండ, జనవరి 26 : బాలసముద్రంలోని జమలాపురం కేశవరావు మెమోరియల్ భవనాన్ని స్వాతంత్ర్య సమరయోధుల కార్యాలయం కోసం కేటాయించారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రేటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే స్వాతంత్ర్య సమర యోధులతో కలిసి ఆదివారం కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమర యోధులను సన్మానించారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

హసన్‌పర్తి, జనవరి 26 : మండలంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ పర్యటన నేపథ్యంలో ఆదివారం బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఇందులో గ్రేటర్ 66వ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, ఆత్మ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, మండల అధ్యక్షుడు బండి రజినీకుమార్, బీఆర్ఎస్వీ బాధ్యుడు జట్టి రాజేందర్, మండల యూత్ అధ్యక్షుడు మేక భగవాన్‌రెడ్డి, పెంబర్తి గ్రామ అధ్యక్షుడు కొయ్యడ గోపికృష్ణ, మాజీ అధ్యక్షుడు ఇల్లందుల గణేశ్, మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు సోరం నాగరాజు, నలిగేటి సాంబయ్య తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- **మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**
- **క్యాతంపల్లి గ్రామంలో పథకాల ప్రారంభోత్సవం**

ధర్మసాగర్, జనవరి 26 : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ధర్మసాగర్ మండలం క్యాతంపల్లి గ్రామంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల ప్రారంభోత్సవ సమావేశం స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా మంత్రి పాల్గొని మాట్లాడారు. క్యాతంపల్లి గ్రామంలో రైతు భరోసా 713 మందికి, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా 43 మందికి, ఇందిరమ్మ ఇండ్లు 355, రేషన్ కార్డులు 207 ఇస్తున్నామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ప్రత్యేక చీఫ్ సెక్రటరీ రామకృష్ణరావు, కలెక్టర్ ప్రావీణ్య, ఆయిల్ ఫెయిడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్ కుమార్ పాల్గొన్నారు. కాగా, సమావేశానికి డీపీఆర్‌వో భానుప్రసాద్ వచ్చి, వేదిక వద్దకు వెళుతుండగా ఆయను పోలీసులు అడ్డుకున్నారు. తాను డీపీఆర్‌వోను అని చెప్పినా వారు వినకపోడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది.

పథకాలు నిరంతర ప్రక్రియ

ఆత్మకూరు/దామెర/నడికూడ : ప్రభుత్వ పథకాలు నిరంతర ప్రక్రియ అని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఆత్మకూరు మండలం గూడెప్పాడ్‌తోపాటు దామెర మండల కేంద్రం, నడికూడ మండలం చౌటుపర్తిలో జరిగిన పథకాల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం అర్హులకు సంక్షేమ పథకాల పత్రాలను అందజేశారు. పరకాల ఆర్డీవో నారాయణ, ఆత్మకూరు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ జగన్ మోహన్‌రెడ్డి, ఏపీవో రాజిరెడ్డి, వ్యవసాయాధికారి శ్రీనివాస్, ఎంపీవో విమల, దామెర మండల ప్రత్యేక అధికారి బాలరాజు, తహసీల్దార్ జ్యోతీవరలక్ష్మీదేవి, ఎంపీవో రంగాచారి, ఏపీవో రాకేశ్, నడికూడ తహసీల్దార్ నాగరాజు, ఏపీవో పోరిక జైసింగ్, ఇన్‌చార్జి ఎంపీడీవో చేతన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మసాగర్ మండలం క్యాతంపల్లిలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

పారదర్శకంగా పథకాలు అమలు

శాయంపేట : ప్రభుత్వం నాలుగు పథకాలను పారదర్శకంగా అమలు చేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన సభలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. డీడబ్ల్యూవో జయంతి, ఎంపీడీవో ఫణిచంద్ర, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీవో రంజిత్‌కుమార్, ఏపీవో అనీత, ఏవో గంగాజమున పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపైకి కోడిగుడ్లు విసిరిన కాంగ్రెస్ కార్యకర్త

గట్లకానిపర్తి గ్రామంలోని సభలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుపైకి కాంగ్రెస్ కార్యకర్త కోడి గుడ్లు విసరడం గందరగోళానికి దారితీసింది.బొమ్మకంటి ప్రశాంత్ కోడిగుడ్లు విసిరినట్లు గుర్తించిన పోలీసులు అతడిని వెంటనే అదుపులోకి తీసుకున్నారు. అయితే ప్రశాంత్ మద్యంమత్తులో ఉన్నట్లు గుర్తించారు. కారు డ్రైవర్‌గా పనిచేసే ప్రశాంత్ లబ్ధిదారుల జాబితా ఉన్నప్పటికీ మద్యం మత్తులో సభపైకి కోడిగుడ్డు విసిరినట్లు గుర్తించారు. పథకాల అమలు సందర్భంగా గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బ్యానర్లు కూడా కట్టినట్లు స్థానికులు చెప్పారు. కూడలి వద్ద ప్రశాంత్ ఫొటోతో ఉన్న బ్యానర్లు దర్శనమివ్వడంతో పార్టీ నేతలు వాటిని చించే ప్రయత్నం చేశారు. ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు అక్కడి నుంచి జనాలను పంపించారు.

పలు గ్రామాల్లో పథకాల ప్రారంభోత్సవం

వేలేరు/ఐనవోలు/కమలాపూర్ : వేలేరు మండలం శాలపల్లి గ్రామంలో రాష్ట్ర అయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, ఐనవోలు మండలం రాంనగర్ రైతు వేదికలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, కమలాపూర్ మండలంలోని దేశరాజ్‌పల్లిలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తౌటం రూన్సీ నాలుగు పథకాలను ప్రారంభించారు. వేలేరులో ప్రత్యేకాధికారి మల్లయ్య, ఎంపీడీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ హెచ్ కొమి, ఏవో కవితరాణి, ఐనవోలులో మండల ప్రత్యేకాధికారి అనురాధ, ఏవో సునీల్‌కుమార్‌రెడ్డి, ఎంపీవో రఘుపతిరెడ్డి, ఏపీవో కుమారస్వామి, గ్రామ ప్రత్యేకాధికారి రవికుమార్, పంచాయతీ సెక్రటరీ రఘురాం, కమలాపూర్‌లో మండల ప్రత్యేకాధికారి రాంరెడ్డి, ఎంపీడీవో బాబు, ఎంపీవో రవి, ఏవో రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెంబర్తిలో జనం లేక సభ ఆలస్యం

వేచి ఉన్న మంత్రులు పొంగులేటి, కొండా

నయీంనగర్, జనవరి 26 : హసన్‌పర్తి మండలంలోని పెంబర్తి గ్రామంలో ఆదివారం ప్రజా పాలనలో భాగంగా ప్రభుత్వ పథకాల ప్రారంభోత్సవానికి నిర్వహించిన సభకు జనం లేక ఆల స్యమైంది. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, ఎంపీ కడియం కావ్య సమీపం లో ఉన్న కాంగ్రెస్ నాయకుడి ఇంటి వద్ద వేచి చూశారు. 12 గంటలకు ప్రారంభం కావాల్సిన కార్య క్రమం 12.35 గంటల వరకు వెయిట్ చేశారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సభా స్థలం వద్ద ఉండి ప్రజలను తీసుకురావాలని స్థానిక కాంగ్రెస్ నాయకులకు పురమాయించారు. గ్రామ పంచాయతీ వద్ద ఉన్న స్థలంలో సభ ఏర్పాటు చేయగా, అక్కడ అపరిశుభ్రంగా ఉండడంతో వచ్చిన జనం ముక్కు మూసుకోవాల్సి వచ్చింది.

సభలో జనం లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

వీరనారాయణపూర్‌లో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

గ్రామసభలో ప్రజల ఆందోళన

ఎల్కతుర్తి, జనవరి 26 : నాలుగు పథకాల అమలు కోసం మండలంలోని వీరనారాయణపూర్ గ్రామంలో ఆదివారం నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. అధికారులు తమ నివేదికలను చదివి వినిపించగా, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. అర్హులకు ఇండ్లు రాలేదని, ఆత్మీయ భరోసాకు అనర్హులను ఎంపిక చేశారని ఆరోపించారు. గ్రామసభ పూర్తిగా కాంగ్రెస్ సమావేశంలా ఉందని ఆరోపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగత్‌సింగ్, ఎంపీడీవో విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జడ్పీ షట్టర్లకు అద్దె టెండర్లు

హనుమకొండ, జనవరి 26 : ఎట్టకేలకు హనుమకొండ జిల్లా పరిషత్ షట్టర్ల అద్దెకు సంబంధించి టెండర్లు నిర్వహించేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. కొన్ని నెలలుగా కలెక్టర్, జడ్పీ అధికారులు తర్జనభర్జన పడుతూ టెండర్లు నిర్వహించేందుకే మొగ్గుచూపారు. ఇందుకుగాను టెండర్ నోటిఫికేషన్ జారీ చేశారు. హనుమకొండ జిల్లా పరిషత్ ఆధీనంలో మొత్తం 14 షట్టర్లతో పాటు, ఒక హాల్, జడ్పీ ఆవరణలో క్యాంటిన్ ఉండగా వీటిని అద్దెకు ఇచ్చారు. కొన్నేళ్లుగా ఉన్నవారికే గడువు పెంచుకుంటూ పోతున్నారు. బహిరంగ మార్కెట్‌కు, ఇచ్చే అద్దెకు వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించిన జడ్పీ అకారులు విషయాన్ని కలెక్టర్ ప్రావీణ్య దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ ఒక కమిటీని నియమించి బహిరంగ మార్కెట్ ధరలను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని సూచించారు. మార్కెట్ అద్దె ధరల్లో వ్యత్యాసం ఉండడంతో ప్రస్తుతం ఉన్న వారికి అద్దె పెంచాలని నోటీసులు ఇవ్వాలంటూ జడ్పీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దీంతో పలుమార్లు కిరాయి దారులకు నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందించకపోవడంతో టెండర్ నిర్వహించాలని నిర్ణయించారు. ఫిబ్రవరి 6 వరకు టెండర్ దరఖాస్తులు స్వీకరించి, 7న మధ్యాహ్నం తెరువనున్నట్లు జడ్పీ అధికారులు తెలిపారు. పూర్తి వివరాల కోసం హనుమకొండ జిల్లా పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

గవర్నర్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

ఎన్పీడీసీఎల్ సీఎండీకి అత్యుత్తమ సేవా పురస్కారం

హనుమకొండ, జనవరి 26 : టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అత్యుత్తమ సేవా గౌరవ పురస్కారానికి ఎంపికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడంలో విశేష కృషి చేసినందుకు ఈ అవార్డును ఆదివారం రిపబ్లిక్ డే సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అందజేశారు. కాగా, సీఎండీ అవార్డు తీసుకోవడంపై పలువురు విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేశారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

హనుమకొండ చౌరస్తా, జనవరి 26 : యువత మత్తు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ పిలుపునిచ్చారు. నెహ్రూ యువ కేంద్ర, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ డిఫెన్స్ సౌజన్యంతో యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ సహకారంతో కేయూలో 'మత్తు, మాదకద్రవ్యాల నియంత్రణ' అంశంపై ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 25 మందికి నిర్వహించిన రెండురోజుల శిక్షణ ఆదివారం ముగిసింది. శిక్షణ పొందిన యువతీ యువకులకు ఈసం నారాయణ సర్టిఫికెట్లు అందజేశారు.

రాజధాని

యూపీఎస్ వచ్చేస్తోంది..

ఏప్రిల్ 1 నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలు

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) అమలును మోదీ సర్కారు ప్రకటించింది. పదవీ విరమణ పొందినవారికి పింఛన్ హామీ, ఆర్థిక భద్రతలే లక్ష్యంగా పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్), జాతీయ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) రెండింటి ప్రయోజనాలను కలగలిపి ఈ యూపీఎస్‌ను కేంద్రం తీసుకొచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఇది అమల్లోకి రానున్నది. అయితే అర్హులైనవారికి ఈ యూపీఎస్ ఎలాంటి పరిస్థితుల్లో వర్తిస్తుందో కూడా ఇందులో పేర్కొన్నారు.

పదవీ విరమణ

కనీసం పదేండ్లు ఎంపిక చేసిన సేవలు అందించి, ఆ తర్వాత రిటైరైన ఉద్యోగులకు యూపీఎస్ వర్తిస్తుంది.

ఎఫ్ఆర్ 56(జే) కింద రిటైర్మెంట్

పెన్షన్ల ప్రొవిజన్స్ కింద కాకుండా రిటైరైన ప్రభుత్వ ఉద్యోగులే అర్హులు.

వాలంటరీ రిటైర్మెంట్

కనీసం 25 ఏండ్లు పనిచేసి, ఆ తర్వాత స్వచ్ఛంధ పదవీ విరమణ తీసుకున్నవారికి రిటైర్మెంట్ వయసు వచ్చాకే పింఛన్.

ఇలాగైతే రాదు..

డిస్మిస్, ఉద్యోగం నుంచి తొలగించిన వారు, రాజీనామా చేసినవారికి యూపీఎస్‌ను ఎంచుకొనే అవకాశం ఉండదు.

యూపీఎస్ ప్రయోజనాలు

- 25 ఏండ్లు లేదా అంతకుమించి క్వాలిఫైయింగ్ సర్వీస్ ఉన్న ఉద్యోగులకు రిటైర్మెంట్‌కు ముందు చివరి 12 నెలలు అందుకున్న వేతనంలోని సగటు బేసిక్ పేలో 50 శాతాన్ని నెలనెలా పింఛన్‌గా అందిస్తారు. సర్వీస్ 25 ఏండ్ల కంటే తక్కువగా ఉంటే పింఛన్ తగ్గుతుంది.
- క్వాలిఫైయింగ్ సర్వీస్‌లో 10 ఏండ్లు, అంతకుమించి ఉన్న ఉద్యోగులకు నెలకు కనీసం రూ.10,000 పింఛన్‌గా చెల్లిస్తారు. 25 ఏండ్లు పనిచేసి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నవారికి, పదవీ విరమణ వయసు వచ్చాకే పింఛన్ మొదలవుతుంది.
- పదవీ విరమణ అనంతరం పింఛన్‌దారుడు చనిపోతే.. ఆ పింఛన్‌లో 60 శాతం భార్య లేదా భర్తకి వస్తుంది.
- నిబంధనలకు లోబడి ఉద్యోగులకు డీఏ తరహాలోనే పింఛన్‌దారుడు, వారు లేకపోతే భాగస్వామికి డియర్‌నెస్ రిలీఫ్‌నూ చెల్లిస్తారు. పింఛన్ మొదలైతేనే వస్తుంది.
- అదనంగా పదవీ విరమణ సమయంలో క్వాలిఫైయింగ్ సర్వీస్‌లోని ప్రతీ ఆరు నెలల కాలానికి నెలవారీ బేసిక్ పే, డీఏలో 10 శాతం చొప్పున లెక్కించి ఎన్నేండ్లయితే అన్నేండ్లకు ఒకేసారి చెల్లిస్తారు. ఈ మొత్తం పింఛన్‌లో తగ్గించరు.

ఇలా ట్రై చేద్దామా..!

లో క్యారెట్ గోల్డ్‌కూ డిమాండే

దేశీయంగా బంగారం ధరలు మళ్లీ ఆల్‌టైమ్ హైల్లో కదలాడుతున్నాయి. మొన్నటి దాకా తగ్గుముఖం పడుతున్నట్లు కనిపించినా.. తిరిగి పుంజుకున్నాయి. దీంతో చాలా మంది అవసరమైతే తప్ప పసిడి కొనుగోళ్లకు వెళ్లడం లేదు. ఇంకొందరైతే రేట్లు మరింత తగ్గుతాయేమోనని ఎదురుచూస్తూ ఉన్నారు. బహిరంగ మార్కెట్‌లో 24 క్యారెట్ గోల్డ్ 10 గ్రాముల విలువ మునుపెన్నడూ లేనివిధంగా రూ.83,000 దాటేసింది మరి. అయితే సరిగ్గా ఇప్పుడే లో క్యారెట్ గోల్డ్.. కొనుగోలుదారులకు చక్కని ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నది. 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత), 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత)లే కాకుండా 18, 14, 10 క్యారెట్ బంగారు ఆభరణాలు కూడా దొరుకుతాయి. నిజానికి ఇప్పుడిప్పుడే ఈ లో క్యారెట్ గోల్డ్‌కూ డిమాండ్ కనిపిస్తుండటం మార్కెట్‌లో మారిన ట్రెండ్‌కు నిదర్శనం.

బడ్జెట్‌కు తగ్గట్టుగా..

కొనుగోలుదారుల అభిరుచికి తగ్గట్టుగా ఇటీవలికాలంలో బడా జ్యుయెల్లర్స్, ప్రముఖ నగల వర్తకులు సైతం 18 క్యారెట్ బంగారు ఆభరణాలను పెద్ద ఎత్తున తయారు చేస్తున్నారు. మరికొన్ని చిన్నచిన్న జ్యుయెల్లర్స్ 14, 10 క్యారెట్ బంగారు నగలనూ తెస్తున్నారు. పైగా భారతీయ మార్కెట్‌లో మెజారిటీ వాటా మిడిల్ క్లాస్ కస్టమర్లదే కావడంతో జ్యుయెల్లర్స్ దృష్టీ ఈ లో క్యారెట్ విభాగంపై గట్టిగానే పడుతున్నది. ఇక వీటిలోనూ నచ్చిన, రకరకాల డిజైన్లు ఇప్పుడు లభిస్తుండటం విశేషం. దీంతో ఎగువ మధ్యతరగతి నుంచి దిగువ మధ్యతరగతి వర్గాలదాకా అంతా వీటి కొనుగోళ్లకు ఆసక్తి చూపిస్తున్నారు. ముఖ్యంగా యువత కూడా మక్కువ చూపుతున్నది. అలాగే ధర తక్కువ కావడం, ఆకర్షణీయంగా కూడా ఉండటంతో మార్కెట్‌లో వీటికి నానాటికీ డిమాండ్ పెరుగుతూపోతున్నది. అందరి బడ్జెట్‌కు తగ్గట్టుగా అందుబాటులో ఉంటుండటంతో పెండ్లిళ్లు, ఇతర శుభకార్యాలకూ ఎక్కువగా వీటినే ఎంచుకుంటుండటం ఈ మధ్యకాలంలో పెరిగిందనే చెప్పవచ్చు.

నాణ్యతకు ఢోకా లేదు

22 క్యారెట్ నుంచి 10 క్యారెట్ వరకు ఆయా ఆభరణాల్లో బంగారం వినియోగం తగ్గుతున్నకొద్దీ వెండి, రాగి, జింక్, నికెల్, పల్లాడియం తదితర లోహాల వాటా పెరుగుతుంది. అందుకే వాటి ధరల్లో అంత తేడా. 22 క్యారెట్ బంగారు ఆభరణాల్లో బంగారం వాటా ఎక్కువగా ఉంటుంది కనుక సహజంగా వీటి రేటు అధికం. 24 క్యారెట్ గోల్డ్ రేటుకు దగ్గర్లోనే పలుకుతుంది. నిజానికి స్వచ్ఛమైన బంగారంతో నగలను తయారు చేయలేం. అందుకే వాటిలో ఇతర లోహాలను కొద్దిగానైనా కలుపుతారు. ఇదే క్రమంలో గోల్డ్ క్యారెట్ తగ్గుతున్నకొద్దీ ఇతర లోహాల పరిమాణం పెరుగుతూపోతుంది. అంతమాత్రం చేత నాణ్యతకు ఢోకా ఉండదు. ఇంకా చెప్పాలంటే 22 క్యారెట్ కంటే 18 క్యారెట్ బంగారు ఆభరణాలే గట్టిగా ఉన్నాయని వినియోగదారులు చెప్పుండటం గమనార్హం.

చివరగా..

ధరలు పెరిగాయనో.. డబ్బు సరిపడా లేదనో కాకుండా మీ బడ్జెట్‌లో ఆయా రకాలలో క్యారెట్ నగలను ఆనందంగా కొనేయండి. అయితే మోసాలకు తావు లేకుండా జాగ్రత్తపడటం మాత్రం మరిచిపోవద్దు. అన్ని నాణ్యతా ప్రమాణాలు ఉన్నాయా? లేదా? అన్నది కనుక్కోవడం మంచిది. ఇక వీటిని మళ్లీ అమ్ముకున్నా.. తరుగుపోను అందులోని బంగారానికి అప్పటి రేటు ఎలాగూ లభిస్తుంది. ధర తక్కువైతే అప్పుడు మరింత హై క్యారెట్ బంగారు నగలకు అప్‌గ్రేడ్ అయిపోండి.

రెండేండ్ల క్రితం దేశీయంగా నగల అమ్మకాల్లో 5 నుంచి 7 శాతంగా ఉన్న లో క్యారెట్ గోల్డ్ ఆర్నమెంట్స్ వాటా.. ఇప్పుడు 15% దాటిపోవడం మారిన ట్రెండ్‌కు అద్దం పడుతున్నది.

-సురేంద్ర మెహెతా, భారతీయ బులియన్, జ్యుయెల్లర్స్ సంఘం కార్యదర్శి

ఇదీ క్యారెట్ కథ..

- **24 క్యారెట్‌లో 99.90 శాతం స్వచ్ఛమైన పుత్తడి ఉంటుంది. దీన్నే మేలిమి బంగారంగా కూడా పిలుస్తారు. కడ్డీలు, బిస్కట్లు, నాణేల రూపంలో అమ్ముతారు.**
- **22 క్యారెట్‌లో 91.67 శాతం స్వచ్ఛత కలిగిన పసిడి లభిస్తుంది. మిగతా 8.33 శాతం (5 శాతం వెండి, 2 శాతం రాగి, 1.33 శాతం జింక్) ఇతర లోహాల మిశ్రమం ఉంటుంది. అత్యుత్తమ శ్రేణి నగల తయారీకి వీన్నే వాడుతారు.**
- **18 క్యారెట్‌లో 75 శాతం ప్యూర్ గోల్డ్ కనిపిస్తుంది. 25 శాతం ఇతర లోహాలే.**
- **14 క్యారెట్‌లో 58.33 శాతం స్వచ్ఛమైన బంగారం. 41.67 శాతం వేర్వేరు లోహాలను కలుపుతారు.**
- **10 క్యారెట్‌లో 41.67 శాతం బంగారం, 58.33 శాతం ఇతర లోహాలు.**



తేలికపాటి నగల హవా

ఒకప్పుడు నడుములు వంగిపోయేంతదాకా నగలు ధరించేవారు. భారీ డిజైన్లతో.. తులాలకొద్దీ బంగారాన్ని పెట్టుకునేవారు. కానీ ఇప్పుడు అంతంత బరువైన నగలను వేసుకొనేందుకు సంపన్నులు సైతం ఇష్టపడటం లేదు. దీంతో మార్కెట్‌లో తేలికపాటి బంగారు నగలకే ప్రస్తుతం ఎక్కువగా డిమాండ్ ఉంటున్నదని నగల వ్యాపారులు అంటున్నారు. నగల తయారీలో వచ్చిన కొత్త టెక్నాలజీ.. సంప్రదాయ, భారీ డిజైన్లనూ తక్కువ బంగారాన్ని వినియోగించి స్వల్ప బరువుకే అందుబాటులోకి తెచ్చేలా చేసిందని ప్రపంచ స్వర్ణ మండలి భారతీయ కార్యకలాపాల విభాగం సీఈవో సచిన్ జైన్ చెప్తున్నారు. మొత్తానికి లైట్ వెయిట్.. లో క్యారెట్ గోల్డ్ ఇప్పుడు పసిడి మార్కెట్‌ను శాసిస్తున్నాయనడంలో సందేహం లేదు.

సూచీలకు బడ్జెటే దిక్సూచి

దేశీయ స్టాక్ మార్కెట్లు రివర్స్‌గేర్‌లోనే నడుస్తున్నాయి. గత వారంలోనూ నిరాశపర్చాయి. ఇన్వెస్టర్లు అమ్మకాల ఒత్తిడిలో ఉండిపోతున్నారు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 428.87 పాయింట్లు లేదా 0.55 శాతం దిగజారి 76,190.46 వద్ద స్థిరపడింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 111 పాయింట్లు లేదా 0.47 శాతం క్షీణించి 23,092.20 దగ్గర ఆగింది. అయితే ఈ వారం బడ్జెట్ అంచనాలు, నిర్ణయాలు.. మార్కెట్లకు దిక్సూచిగా ఉండనున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కొత్త బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. ఇది శనివారమైనప్పటికీ స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ జరుగనున్నది. సాధారణంగా శని, ఆదివారాలు స్టాక్ మార్కెట్లకు సెలవు అన్న విషయం తెలిసిందే. దీంతో బడ్జెట్‌ను ఇన్వెస్టర్లు మెచ్చితే సూచీలు పైకి, లేకుంటే కిందికి అనుకోవచ్చు. ప్రధానంగా ఆయా రంగాల షేర్లను పన్నులు, ప్రోత్సాహకాలు నడిపిస్తాయని చెప్పవచ్చు. ఆదాయ పన్నుల్లో ఊరట లభిస్తే ఆటో, రియల్టీ, బ్యాంకింగ్ షేర్లకు ఊతమిచ్చినట్టే. అలాకాకున్నా ఇవే ముందుగా ప్రభావితం కావచ్చు. ఇక డాలర్‌తో పోల్చితే ఇంకా ఆమోదయోగ్యం కాని స్థాయిల్లోనే కొట్టుమిట్టాడుతున్న రూపాయి మారకం విలువ.. మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నది. గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ మదుపరుల పెట్టుబడులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలూ కీలకమే. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 22,700 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,500 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,300-23,500 స్థాయికి వెళ్ల వచ్చని కూడా చెప్తున్నారు.

గమనిక..: స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

తపాలా పథకాలు భళా

గరిష్ఠంగా 8.2 శాతం వడ్డీరేటు

తపాలా శాఖ రకరకాల పెట్టుబడి పథకాలను అందిస్తున్నది. ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ), రికరింగ్ డిప